


రాత్రి 8 వరకు 'గుడిమల్లం'లో దర్శనం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దిల గురుమూర్తి కషితో గుడిమల్లం శ్రీ పరశు రామేశ్వర స్వామి ఆలయం సందర్శన సమయం రాత్రి 8 గంటల వరకు పొడిగించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సందర్శనార్థం ఈ సమయాన్ని సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పొడిగించారు. గతంలో 6 గంటల వరకే దర్శనం ఉండేది. స్థానిక శాసన సభ్యులు మధుసూదన్ రెడ్డి సూచన మేరకు ఎంపీ గురుమూర్తి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కిషన్ రెడ్డిని కలిసి సమస్యను వారికి విన్నవించగా ఆలయ దర్శన సమయం రాత్రి 8 గంటల వరకు పొడిగిస్తూ ఆ మేరకు ఆర్కియాజికల్ సర్వే అఫ్ ఇండియా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎంపీ గురుమూర్తి ధన్యవాదాలు తెలియజేశారు.



'ఉపాధి' నిర్'లక్ష్యం'

20 శాతానికి మించని పనిదినాలు

జిల్లా అధికారుల నిర్లక్ష్యమే కారణమా

ఇంకా ఒక్కరోజే మిగిలిన గడువు

ప్రజాశక్తి - బాలాయపల్లి

'కూలీలకు రెండు పూటలా కడుపు నింపేందుకు వామపక్షాల చొరవతో అప్పటి యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం ప్రస్తుత బిజెపి హయాంలో నీరుగారిపోతోంది.. ఏడాదంతా వంద రోజుల పనిదినాలు 20 శాతానికి మాత్రమే కల్పించారంటే జిల్లా అధికారుల చిత్తశుద్ధి అర్థమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో 'ఉపాధి' అధికారులు ఇపుడు పరుగులు తీస్తున్నారు.

తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలో 10,625 జాబ్‌కార్డులు ఉన్నాయి. 8,125 మంది కూలీలు ఉన్నారు. అయితే ఈ ఏడాది ఉపాధి పనుల్లో 2వేల మంది మాత్రమే పాల్గొన్నారు. వంద రోజుల పనిదినాలు కేవలం 954 మందికి మాత్రమే కల్పించారు. ఇంకా రెండు రోజుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం పూర్తి కానుంది. కూలీలకు కల్పించాల్సిన వంద రోజుల పనిదినాలు మురిగిపోనున్నాయి. దీంతో కూలీలకు పూర్తిగా నష్టం వాటిల్లనుంది. ఉపాధి సిబ్బంది కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కూలీలు వలసలు పోతున్నారు. ఈ కారణంగానే బాలాయపల్లి మండలం లక్ష్యం చేరుకోవడంలో వెనకబడిందన్నది వాస్తవం. కేవలం 20.32 శాతం మాత్రమే పనిదినాల లక్ష్యాన్ని చేరుకుంది. జాబ్‌కార్డు ఉండి పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని చూపించాలన్నది చట్టంలోని నిబంధన. ఈ పథకానికి నిధుల కొరత లేదు. నిర్దేశించిన పనులను పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి. కానీ జిల్లాలో పరిస్థితి భిన్నంగా ఉంది. క్షేత్రస్థాయిలో పని కావాలని అడుగుతున్నా కల్పించలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఏటా కోట్ల రూపాయలైనా ఖర్చు చేసే అవకాశం ఉన్నా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత వెరశి తూతూమంత్రంగానే పనులు జరుగుతున్నాయి. కూలీలకు ఏటా వంద రోజుల పాటు పని దినాలు కల్పించలేని దుస్థితి నెలకొంది. ఫలితంగా లక్ష్యం నెరవేరకపోగా, గ్రామీణ కూలీలకు ఉపాధి అందని ద్రాక్షలానే మిగిలిపోయింది. కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్‌తో పాటు తాగునీరు, ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. కానీ ఈజీఎస్ అధికారులు కూలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఉపాధి పనులు చేసేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు.

వేగవంతంగా చర్యలు

స్వరూపరాణి, ఎంపిడిఒ, బాలాయపల్లి

ఈ మండలానికి కొత్తగా వచ్చాను. 2023-24లో ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా.. పనులు కల్పించడంలో ఎక్కడ నిర్లక్ష్యం ఉందో వెంటనే పరిశీలించి, పనులు ప్రారంభించేలా చూస్తా.

పనులు అడిగినా కల్పించలేదు



గంప పుల్లయ్య, మన్నూరుమిట్ట

గత ఏడాది నుంచి ఇప్పటివరకూ మన్నూరు గ్రామమిట్ట ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. కూలి ఆధారంగా బతికేవాళ్లం. పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసెళ్లి బతుకుతున్నాం. మా గ్రామంలోనే మాకు ఉపాధి హామీ పనులు కల్పిస్తే మాకు జీవనాధారంగా ఉంటుంది.

బేల్దారి పనులకు వెళుతున్నా



సుబ్బరత్నమ్మ, అంబలిపుడి గిరిజనకాలనీ

ఉపాధి హామీ పనులు కల్పించలేదు. దీంతో ఇల్లు గడవడానికి బేల్దారి పనులకు వెళుతున్నాను. వలసెళ్లి పనులు చేసుకుని వస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి. ఉపాధి హామీ అధికారులను అనేకసార్లు అడిగినా పట్టించుకోవడం లేదు. మాకోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం పనులు కల్పించకపోవడంతో ఉండి లేనట్లే అనేలా ఉంది. మాకు వలసెళ్లక తప్పడం లేదు.



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

మోడీ మెడలు వంచుదాం..!

మండుటెండలో...ఆరు మండలాల్లో..!

సిఐటియు, రైతు, వ్యకాసం స్కూటర్‌ర్యాలీ

'5న చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి/ బిఎన్ కండ్రిగ

'పేదలపై భారాలు మోపుతూ, కార్పొరేట్లపై రాయితీల వర్షం కురిపిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి' అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 5న సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిఎన్ కండ్రిగ మండలం నుంచి తిరుపతి వరకూ గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. మండుటెండలో ఆరు మండలాల మీదుగా ఈ ర్యాలీ సాగింది. రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జనార్ధన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పల్లె పల్లెకు తిరుగుతూ మోడీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్మికులు, కర్షకుల వద్ద ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, దీన్ని నిరసిస్తూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో రైతుసంఘర్షణ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. నరేంద్రమోడీ సామాన్య ప్రజలపై అధిక ధరలు పెంచి నడ్డివిరుస్తూ, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. వ్యవసాయ పంటలకు మద్దతు లేకుండా, కూలీలకు కనీస వేతనం లేకుండా, కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ఇటీవల నల్లచట్టాలను తీసుకొచ్చి రైతుల పోరాటంతో రద్దు చేసిన మోడీ మళ్లీ అదే చట్టాలను చాపకింద నీరులా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఉచిత విద్యుత్ అమలు చేస్తున్న రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు మోడీ ఆదేశాలు జారీ చేశారన్నారు. స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 40చట్టాలను నేడు మోడీ ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్లుగా కుదించి కార్మికుల కడుపు కొట్టి యజమానులకు దోచి పెడుతోందన్నారు. వామపక్షాల మద్దతుతో తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మోడీ ప్రభుత్వం బడ్జెట్లో కేవలం 60వేల కోట్ల రూపాయలు తగ్గించి, కూలి రేట్లు పెంచకుండా పేదల నోట్లో మట్టి కొట్టిందన్నారు. ఉపాధి హామీ పథకానికి గతంలో లక్షా 20వేల కోట్లు కేటాయించగా, నేడు కేవలం 60వేల కోట్లే కేటాయించడం దారుణమన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగలో ప్రారంభమైన స్కూట్ ర్యాలీ కరాకొల్లు మీదుగా బోనుపల్లి, చిట్టత్తూరు, కొత్తకండ్రిగ, శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుకుంది. ఈ బైక్ ర్యాలీలో వ్యకాసం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.రమణయ్య, తలారి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు గురవమ్మ, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రంగయ్య, కౌలురైతు సంఘం నాయకులు టి.బాలగురవయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, గురవయ్య, నాగరాజు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశాండి అరుణాచలం, హరి, సుబ్బయ్య, చిన్న గురవయ్య, తిరుపాలు, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఎస్.జయచంద్ర

కనీస వేతనం రూ.750 ఇవ్వాలి : సిఐటియు

క్యాంపస్ : అగ్రికల్చర్ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్ కార్మికులకు కనీస వేతనం రూ.750 ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు జయచంద్ర డిమాండ్ చేశారు. గురువారం అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆవరణలో జనరల్‌బాడీ సమావేశం జరిగింది. జయచంద్ర మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నా కాంట్రాక్టు లేబర్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వలేదన్నారు. లేబర్ యాక్ట్ ప్రకారం రూ.750 ఇవ్వాలని చట్టం చెబుతున్నప్పటికీ, ఒకరోజు వేతనం రూ.340 ఇస్తున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెబుతున్నా ప్రభుత్వ ఆఫీసుల్లో అమలు జరగడం లేదన్నారు. జాతీయ పండుగల సందర్భంగా సెలవులు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట నాగవెంకటేష్, అగ్రికల్చర్ యూనివర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, ఉపాధ్యక్షురాలు చంద్రమ్మ సుబ్రహ్మణ్యం, మదన్, రాధా, రమాదేవి, ప్రసాద్, మునిలక్ష్మి, నాగరత్న, జ్యోతి, సుశీల, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాముని సేవలో కలెక్టర్ కుటుంబం

కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు

తిరుపతి సిటి: కోదండ రామాలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం మూలవర్లకు అభిషేకం చేశారు. 8 నుండి 9 గంటల వరకు ఊంజల్ మండపంలో సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు పెద్దజీయర్‌స్వామివారి మఠం నుండి అర్చకులు నూతన వస్త్రాలను తీసుకొని విమానప్రదక్షిణగా వచ్చి స్వామివారి మూలవర్లకు, ఉత్సవర్లకు సమర్పించారు. ఆ తరువాత శ్రీరామ జన్మపురాణం, ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ సస్పెన్షన్ ప్రజాస్వామ్యానికి చీకటిరోజు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి



కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్‌గాంధీపై సస్పెన్షన్ వేటు ప్రజాస్వామ్యానికి చీకటి రోజని పిసిసి రాష్ట్ర కార్యదర్శి యార్లపల్లి గోపి, పిసిసి ప్రతినిధులు పి.శ్రీనివాసులురెడ్డి, రావణ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి టౌన్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే రాహుల్‌గాంధీపై వేటు వేశారన్నారు. కోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్లేందుకు నెలరోజులు గడువు ఉన్నా గంటల్లోనే రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేసి దుర్మార్గపు చర్యకు బిజెపి పూనుకుందన్నారు. లక్షల కోట్ల రూపాయల సంపదను అదానీకి దోచి పెడుతున్న మోడీని నిలదీస్తున్నందుకు సహించలేని బిజెపి అనైతిక చర్యకు పాల్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేంద్రబాబు, సమీరుల్లా, వెంకటేష్ గౌడ్, శ్రీహరి, చిన్నయ్య, మణి పాల్గొన్నారు.

దేశ్‌కా బచావో...మోడీ హటావో

14 నుంచి మే 15 వరకు ప్రజాచైతన్య యాత్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ 'దేశ్ కా బచావో-మోడీ హటావో' అన్న నినాదంతో ఏప్రిల్ 14వతేదీ నుంచి మే 15వతేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. తిరుపతి నగరం బైరాగి పట్టెడలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాహుల్ పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఆర్థిక నేరగాడు నీరవ్ మోడీతో రాహుల్ గాంధీని విమర్శించడం బిజేపీకి తగదన్నారు. రాహుల్ గాంధీ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అన్ని రాజకీయ పార్టీలతో కలిపి త్వరలో ఉద్యమం చేపడతామని తెలిపారు. అదానీ కేసు తరహా లోనే, వివేకా హత్య కేసుకొలికొచ్చే సమయంలో కేంద్రం సుప్రీంకోర్టు ద్వారా కమిటీ వేయించి సీఎం జగన్‌ను బ్లాక్ మెయిల్ విధానానికి కేంద్ర ప్రభుత్వం వాడుకుంటుందని అన్నారు. జగన్ పదే పదే ఢిల్లీకి ఎందుకు పరుగులు పెడుతున్నారో అసలు విషయం బట్టబయలైందన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసు తీర్పు సుప్రీంకోర్టులో చివరి దశకు రావడంతో భయంతో జగన్ ఢిల్లీకి వెళ్ళాడని చెప్పారు. అమిత్ షాతో జగన్ రాజకీయ ఒప్పందం కుదుర్చుకుని, వివేకానంద రెడ్డి హత్య కేసు నుంచి తప్పించడానికి కర్ణాటక ఎన్నికల్లో 100 సీట్లు గెలిపించాలని అమిత్ షాతో ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. జగన్ సంపాదించిన అక్రమ ఆస్తులు మొత్తాన్ని కర్ణాటక ఎన్నికల్లో ఖర్చు చేయబోతున్నాడని తెలిపారు. బిజెపితో చేసుకున్న ఒప్పందంతో వివేకానందరెడ్డి హత్య కేసు తీర్పు ఆలస్యం కాబోతుందని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టు పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. జయలక్ష్మి , సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి , చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు పాల్గొన్నారు.



చిందేపల్లి రోడ్డు సమస్య పరిష్కారానికి..

అవసరమైతే పవన్ వస్తారు : జనసేన

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

చిందేపల్లి రోడ్డు సమస్య పరిష్కారానికి అవసరమైతే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వస్తారని జనసేన జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఏర్పేడు మండలం చిందేపల్లి వద్ద గత 14 రోజులుగా ల్యాంకో ఫ్యాక్టరీ అక్రమంగా ఆక్రమించుకుని నిర్మించిన గోడను తొలగించాలని గ్రామస్తులతోకలిసి జనసేన పోరాటం చేస్తుంటే పోలీసులు వైసిపి కనుసన్నల్లో పనిచేస్తున్నారన్నారు. 70 ఏళ్లకు పైబడి ఏడెనిమిది గ్రామాల ప్రజలు వినియోగించుకుంటున్న ఆర్ అండ్ బి రోడ్డును ల్యాంకో ఏవిధంగా తన అడ్డాగా మార్చుకుంటుందని ప్రశ్నించారు. బుధవారం శివాలయంలో శాంతియుతంగా దీక్ష చేస్తున్న గ్రామస్తులు, జనసేన నాయకులపై పోలీసులు విచక్షణారహితంగా కొట్టుకుంటూ అరెస్టు చేసి వివిధ ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్లకు తిప్పడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులు ఐపిసి కోడ్‌ను ఫాలో అవుతున్నారా? వైసిపి కోడ్‌ను ఫాలో అవుతున్నారా? అని మండిపడ్డారు. 2016లో జీవో నంబర్ 22 ద్వారా అక్కడి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మార్గాలను ఆర్ అండ్ బి పరిధిలోకి తీసుకుంటూ జీవో జారీ చేశారని గుర్తు చేశారు. ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయమని కలెక్టర్ చెప్పడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత, తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, చంద్రబాబు, రాజారెడ్డి, కీర్తన పాల్గొన్నారు.

తరతరాల రోడ్డును కాపాడుకునేందుకు...

చిందేపల్లి గ్రామస్తుల వీరోచిత పోరాటం

- ల్యాంకోకు పట్టని సామాజిక బాధ్యత
- 'ఫ్యాక్టరీ'కి గుత్తగా అమ్మేసిన వైసిపి పెద్దలు..?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థలాలను కబ్జా చేయడం చూశాం.. పొలాలను ఆక్రమించుకోవడం చూశాం..అయితే ల్యాంకో ఫ్యాక్టరీ (ఈసిఎల్) ఏకంగా తరతరాలుగా వాడుకలో ఉన్న రోడ్డునే మూసేసి తన అడ్డాగా మార్చేసుకుంది..గ్రామస్తులకు అండగా నిలవాల్సిన పోలీసులు ఈసిఎల్ యాజమాన్యానికి కొమ్ముగాశారు.. తమ రోడ్డును మూసేశారంటూ ప్రైవేట్ పరిశ్రమ వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగితే వారికి మద్దతుగా నిలవాల్సిన పోలీసులు బాధితులపైనే లాఠీ ఝుళిపించడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి. రోడ్డును ఆక్రమించడమే కాకుండా ప్రజలపై దౌర్జన్యాలకు దిగుతున్న ల్యాంకో యాజమాన్యంపై చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం ఏకంగా పోలీసు భద్రత కల్పించడంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ పెద్దలు ఆ రోడ్డును రహస్యంగా ల్యాంకో యాజమాన్యానికి ధారాదత్తం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. అందుకే చిందేపల్లి వాసులు కుయ్యో మొర్రో అంటున్నా, ప్రతి పక్షాలు ఆందోళనకు దిగుతున్నా వైసీపీ పెద్దలు మాత్రం వేడుక చూస్తుండటం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. తాజాగా తమ రోడ్డు తమకే కావాలంటూ చిందేపల్లి వాసులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను సైతం పోలీసులు భగ్నం చేసిన నేపథ్యంలో చిందేపల్లివాసుల వీరోచిత ఉద్యమం ఎటు దారితీస్తుందో వేచి చూడాల్సిందే. వీరి ఆందోళనకు సిపిఎం, జనసేన మద్దతు ప్రకటించి ప్రత్యక్షంగా ఆందోళన చేస్తున్నాయి. తొలుత కలెక్టర్‌ను, ఎస్పిలను కలిసారు. పరిశ్రమ వద్ద ఆందోళన చేశారు. చివరికి మూడు రోజులుగా నిరసన దీక్ష చేస్తుంటే ఆలయంలోని గర్భగుడిలోకి వెళ్లి మరీ గ్రామస్తులపై పోలీసులు లాఠీలను ఝుళిపించడం గమనార్హం.

శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద సుమారు మూడు దశాబ్దాల కిందట ల్యాంకో పరిశ్రమ సుమారు 60ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమ కోసం పూతలపట్టు- నాయుడుపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎంతో విలువైన భూమిని రైతులు త్యాగం చేశారు. పరిశ్రమ స్థాపన సమయంలో



తరతరాలుగా వినియోగిస్తున్న చిందేపల్లి రహదారికి అడ్డంగా ల్యాంకో గేటు

నిర్వాసితులకు జీవనోపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అవసరం తీరాక బాధితులకు మొండి చెయ్యి చూపారు. సుమారు రెండు దశాబ్దాల వరకు యాజమాన్యం మారలేదు. ఆ తరువాత జరిగిన పరిణామాల్లో యాజమాన్యం మారింది. ల్యాంకోగా ఉన్న పేరును శ్రీకాళహస్తి పైప్స్ అని పేరు మార్చారు. ఆ తరువాత ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ (ఈసీఎల్) గా మళ్లీ పేరు మార్చారు. మొదటి యాజమాన్యం ఉన్నపుడు స్థానికులతో పెద్ద వివాదాలు ఉండేవి కావు. అయితే యాజమాన్యం మారిన తరువాత ఈసీఎల్ వద్ద నిత్యం వివాదమే. ఈ పరిశ్రమలో ఉత్పత్తులు పెంచడానికి భూమి అవసరమైంది. దీంతో పరిశ్రమ పక్కనే ఉన్న భూమిపై ఈసీఎల్ వారి కన్ను పడింది. వారు తమ పలుకుబడిని వినియోగిస్తూ వివిధ మార్గాల ద్వారా ఇప్పటి వరకు రెండు వందల ఎకరాలకు పైగా భూమిని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అందులో భాగంగానే సుమారు ఎనిమిది దశాబ్దాలుగా ఉన్న చిందేపల్లె రహదారిని కూడా అధికార బలంతో స్వాధీనం చేసుకుని అడ్డంగా గోడ కట్టేశారు. ఈ రోడ్డును మూసివేయడం వెనుక కేంద్ర ప్రభుత్వంలో కీలక నేత హస్తం ఉందని బలంగా ప్రచారం జరుగుతోంది. అయితే స్థానిక బీజేపీ నేతలు ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నారు. చిందేపల్లె వాసులకు న్యాయం చేయాలని చెప్పాల్సింది పోయి, తమ నేత పేరు వాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్థానిక బీజేపీ నేతలు హెచ్చరికలు చేయడం విడ్డూరంగా ఉంది. ఈ నేతలు ప్రజల పక్షమా...? లేక యాజమాన్యం పక్షమా అర్థం కావడం లేదు. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకున్నా కేంద్ర పెద్దల అండ చూసుకుని ఈసీఎల్ యాజమాన్యం రెచ్చిపోతోందన్న విమర్శలు ఉన్నాయి. పోలీసులను వాడుకుని శాంతియుతంగా నిరసన చేసే సామాన్య ప్రజలపైనా వారికి మద్దతు తెలిపే రాజకీయ పార్టీల నేతలపైన వీరు ఉక్కు పాదం మోపుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వంలో ఓ కీలక నేత అండ ఉండటమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈసీఎల్ వైపే అధికార, పాలకగణం

స్వాతంత్ర్యం రాక మునుపు నుంచే చిందేపల్లి రోడ్డు వాడుకలో ఉంది. కోళ్ల ఫారం నుంచి చిందేపల్లి మీదుగా ఈ లింకు రోడ్డు వెంకటగిరి ప్రధాన మార్గంలో కలుస్తుంది. 2016వ సంవత్సరం వరకు ఈ రహదారి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ఆ తరువాత 2016 ఏప్రిల్‌లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక జీవో ప్రకారం రోడ్లు, భవనాల శాఖ పరిధిలోకి చేరింది. కోళ్లఫారం నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్డు చిందేపల్లి మీదుగా(10కి.మీ.) వెంకటగిరి ప్రధాన మార్గంలో కలుస్తుంది. సుమారు ఐదు గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రహదారిని ఈసీఎల్ వారు అధికార అహంతో ఆక్రమించి అడ్డంగా గోడ కట్టేశారు. తరతరాలుగా తమ ఆధీనంలో ఉన్న రోడ్డును ల్యాంకో ఆక్రమించుకోవడంపై చిందేపల్లివాసులు మండిపడుతున్నారు. వీరోచిత పోరాటం చేస్తున్నారు.

టవర్ క్లాక్ పనుల పరిశీలన



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద నిర్మాణంలో ఉన్న టవర్ క్లాక్ పనులను గురువారం ఎమ్మెల్యే వరప్రసాదరావు పరిశీలించారు. నాణ్యతగా పనులు చేయాలని సూచించారు. ఉన్న టవర్ క్లాక్ శిథిలావస్థకు చేరుకోవడంతో గత సంవత్సరం కూల్చేశారు. నూతన క్లాక్ నిర్మాణాన్ని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కుమారుడు నవీన్‌గుప్త తన సొంత నిధులతో పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో పనులను ఎమ్మెల్యే పరిశీలించి నాణ్యతగా త్వరలోనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్ , రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సీతారాములకు మంత్రి పట్టువస్త్రాలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కాపు వీధిలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా, సెల్వమణి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను పదిరోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, కౌన్సిలర్ ఏకాంబరం, భానుమతి, చక్రి, కె.నరసింహారావు, జాన్‌కెనడి, శివాలయ ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సిరుగురాజుపాలెం సర్పంచి మురళీమోహన్ యాదవ్, ఆరేటమ్మ ఆలయ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు మునికష్ణయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ



ప్రజాశక్తి-పాకాల: నూతనంగా శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన శోభకత్ నామ సంవత్సరం ఉగాది తెలుగు పంచాంగాన్ని, క్యాలండర్లను గురువారం జడ్పీటీసీ పద్మజరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ప్రబోధ సేవాసమితి సభ్యులు త్రైత శకం పంచాంగాన్ని, క్యాలండర్లను పలువురికి అందించారు. జ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీకి చెందిన పాకాల సభ్యులు మాధవ, శివ ప్రసాద్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్త పింజరి పాము విషపూరితం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రక్తపింజరి పాము విషపూరితమని.. పాము కాటేస్తే గుండెకు రక్తం సరఫరా ఆగిపోతుందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్నేక్ స్నాచర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం రాత్రి పుత్తూరు మండలంలోని ఏఎం అగ్రహారంలోని ఓ ఇంట్లోకి రక్తపింజరి పాము వెళ్లడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖలో పనిచేస్తున్న స్నేక్‌స్నాచర్ శ్రీకాంత్‌కు సమాచారం అందడంతో గ్రామానికి చేరుకుని పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపింజరి చాలా విషపూరితమని.. వెంటనే తనకు సమాచారం అందిస్తే తాను సాయం చేస్తానని తెలిపారు.

ఎస్‌డీజీ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వరదయ్యపాళెం: ఎస్‌డీజీ సర్వేలో భాగంగా 0-5 సంవత్సరాల పిల్లల వివరాలను సేకరించి సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు కోరారు. గత కొన్ని రోజులుగా 18 సంవత్సరాలలోపు పిల్లలకు సంబంధించిన వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు నిర్వహిస్తున్నారు. సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో కోరారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



ప్రజాశక్తి-కోట: ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలంటే పట్టుదలతో పదో తరగతి పరీక్షల్లో తప్పక విజయం సాధించాలని కోట సబ్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు అన్నారు. కోటలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో గురువారం పదో తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యూత్ సభ్యులు మీజూరు చంద్రప్రకాష్ మిత్రబందం దాతత్వంతో విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. కోటమ్మ తల్లి ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, ఎస్సై పుల్లారావులచే విద్యార్థులకు అందించారు. ఎస్సై మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు జీవితానికి ఓ దిక్సూచిలాంటిదని, మంచి ర్యాంకు తెచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అంబేద్కర్ యూత్ సభ్యులు కర్లపూడి కిషోర్, గోపి, రమేష్, తిన్నెలపూడి శివశంకర్, యంపల కిరణ్, ఆదర్శ్‌లను అభినందించారు. కార్యక్రమంలో శ్రీ సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, పాఠశాల సిబ్బంది, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తొలగని చెత్త..!



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చెత్త రహిత మున్సిపాలిటీలుగా.. గ్రామాలుగా ఏర్పాటు చేయాలన్న నినాదంతో స్వచ్ఛ సర్వేక్షణ ర్యాలీలు చేపడుతోంది. పరిశుభ్రతకు విరివిగా నిధులు వెచ్చిస్తోంది. అయితే పుత్తూరు మున్సిపాలిటీలోని పలు చోట్ల అధ్వానంగా చెత్త దర్శనమిస్తోంది. పురపాలక సంఘం పరిధిలో 14వ వార్డు, షాప్ వీధి చివరిలో చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసనతోపాటు దోమల కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాల బారిన పడుతతూ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం జ్వరాల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు ప్రభుత్వాసుపత్రిలో రోగుల ఓపీలు సైతం పెరుగుతున్నాయి. చెత్తను తొలగించడంతో ఆలస్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్త కుండీ నిండి గత పది రోజులుగా కావస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వడదెబ్బకు సాయం..!

- పోస్టుమార్టం.. వైద్యాధికారి నివేదిక కీలకం - ప్రజల్లో అవగాహన తప్పనిసరి

ఎండలు మండుతున్నాయి.. భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండ తీవ్రతకు జనం బెంబేలెత్తిపోతున్నారు. వత్తిదారులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి వేతనదారులు, శ్రామికులు, రైతులు జీవనోపాధి కోసం ఎండను సైతం లెక్కచేయకుండా పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే ఆ కుటుంబం కోలుకోలేని విధంగా నష్టపోతుంది. ఇలాంటి సమయాల్లో ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం పొందాలంటే అవగాహన అవసరం.



ప్రజాశక్తి-ఓజిలి

వడదెబ్బకు గురవుతున్న వారిలో ఎక్కువగా పేదవారు ఉంటున్నారు. వీరిలో చాలామందికి నష్టపరిహారం ఎలా పొందాలో అవగాహన లేదు. ఇలాంటి వారికి నిపుణులు పలు సూచనలు అందజేస్తున్నారు. వడదెబ్బకు గురైతే ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేస్తుంది. దీనికి సంబంధించి ప్రతి మండలానికి ఓ కమిటీ ఉంటుంది. ఆ కమిటీ వడదెబ్బకు గురై చనిపోయిన వారి వివరాలు నివేదికను కలెక్టర్ పంపుతుంది. ఆయన పరిశీలించి పరిహారాన్ని విడుదల చేయడం జరుగుతుంది. వడదెబ్బ తగలకుండా కూలీలు, డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలని, టోపీలు,హెల్మెట్, గొడుగులు వినియోగించుకోవాలి.

ఎవరిపై ఎక్కువ ప్రభావం

60 సంవత్సరాలు పైబడిన వద్ధులు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగేవాళ్లు, అతిగా ఔషదాలు తీసుకొనేవారు సైతం జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో ఎక్కువ సేపు ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

వడదెబ్బ లక్షణాలు:

శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపు తప్పుతుంది. నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది. వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఏర్పడతాయి. శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం ఏర్పడుతుంది. దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సభ్యులుగా అధికారులు

మరోవైపు ఎండ తీవ్రతకు ఉపాధిహామీ వేతనదారులు, శ్రామికులు రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. కారు, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు ఎండలోనే తిరగడంతో డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వడదెబ్బ మృతుల నిర్ధారణకు కమిటీలో మండల వైద్యాధికారి, తహశీల్దారు, సబ్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారు. వడదెబ్బతో మరణం సంభవిస్తే కమిటీ సభ్యులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలి. ఆ వ్యక్తి వడదెబ్బతో మతిచెందినట్లు ముందుగా వైద్యాధికారి ధ్రువీకరించాలి. అనంతరం పోలీసులు కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి సమీపంలోని ఆసుపత్రికి మతదేహాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తారు . ఆ నివేదిక వైద్యాధికారి పోలీసులు ఎఫ్ఐఆర్ ఆధారంగా వడదెబ్బ మతిగా నిర్ధారిస్తారు. ఈ నివేదికను మండల తహశీల్దారుతో ఆర్డీవోకు..అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయానికి నివేదికను సమర్పిస్తారు.

పరిహారంతో ఆసరా



వడదెబ్బ తగులుతున్న వారిలో అధికశాతం కూలీ పనులకు వెళ్లే వారు ఉన్నారు. అనుకోకుండా వీరు మరణిస్తే వడదెబ్బ పరిహారం గురించి అవగాహన లేకపోవడంతో సమాచారం అందజేయలేకపోతున్నారు. వడదెబ్బతో మతిచెందిన వారికి నష్టపరిహారం అందితే వారి కుటుంబసభ్యులకు ఎంతో కొంత ఆసరాగా ఉంటుంది. **- డి.ఆదిలక్ష్మి, ఎస్సై, ఓజిలి**

పోస్టుమార్టం తప్పనిసరి



వేసవిలో వేడి గాలులతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అనుకోని సంఘటనల కారణంగా వ్యక్తి మరణిస్తే కుటుంబంలో వ్యక్తులకు నష్టపరిహారం అందుతుంది. మరణించిన వ్యక్తికి తప్పనిసరిగా పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉంటుంది. పరిహారం అందితే బాధిత కుటుంబాలకు కొంతైనా మేలు జరుగుతుంది.

- డాక్టర్.ఎ.మాధవ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కలెక్టర్‌కు నివేదిక పంపుతాం



వడదెబ్బతో ఎవరైనా మరణిస్తే త్రిసభ్య కమిటీకి సమాచారం ఇవ్వాలి. వైద్యాధికారి, ఎస్సై వివరాలు ఇస్తే రెవెన్యూ డివిజన్ అధికారులకు, కలెక్టర్ కార్యాలయానికి నివేదికను సమర్పిస్తాం.

- డి.లాజరస్, తహశీల్దారు, ఓజిలి

కమనీయం.. సీతారాముల కల్యాణం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ రామనవమి వేడుకలు గురువారం తుమ్మలగుంటలో కనులపండువగా జరిగాయి. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. జగదాభిరాముని కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు. ముందుగా ఆలయంలోని స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి తీసుకొచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీటలపై ప్రతిష్ఠింపజేశారు. ముందుగా విశ్వక్సేనారాధన, గణపతి పూజలతో కల్యాణం దిగ్విజయంగా కొనసాగింప జేయాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వాములు రక్షాబంధనాలను సీతా అమ్మవారి, రాముల వారి ముంజేతికి అలంకరింపజేశారు. సుముహూర్తం ప్రారంభం కాగానే అర్చకులు అమ్మవారి, స్వామి వారి తలలపై జీలకర్ర బెల్లంతో అలంకరించారు. అనంతరం మంగళసూత్రాన్ని భక్తులకు దర్శింపజేసి రాములవారి చేతులకు తాకించి సీతాదేవి మెడలో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు జయ జయధ్వానాలు పలుకగా తలంబ్రాలను సీతారాముల తలలపై ఉంచి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని ముగింపజేశారు. తుమ్మల గుంట గ్రామానికి చెందిన నల్లందుల సుధాకర్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు హాజరై వివాహ మహాత్మ్యాన్ని తిలకించారు. ప్రతి ఏటా కల్యాణ వెంకన్న ఆలయం వద్ద జరిగే శ్రీ సీతారాముల కల్యాణంను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డులో వెలిసిన శ్రీ రామ మందిరంలో గురువారం ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గారా బాబురావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. తొమ్మిదో రోజు శ్రీ సీతారాముల కల్యాణం, అన్నదానం చేపడుతామని తెలిపారు.



తిరుపతి(మంగళం): శ్రీరామనవమి సందర్భంగా మంగళం పరిధిలో సాయిబాబా మందిరంలో బాబా జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామాలయంలో వేడుకగా రాముల వారి కళ్యాణాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా తిరుపతి నగర పరిధిలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయం వద్ద శాంత స్ఫూర్తి సేవా ఫౌండేషన్ ఛైర్మన్ లోకాచారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు పానకాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత విలువలు

తిరుపతి టౌన్ : చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, బాగా చదువుకుని ఉన్నత విలువలతో రాణించాలని, అపుడే ఆ కుటుంబం, గ్రామం, మండలం అభివృద్ధి చెందుతుందని న్యాయవాది ఎస్ఎం అంబిక తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మ కళాక్షేత్ర అకాడమీకి చెందిన 20 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న పేద పిల్లలకు తిరుపతిలోని ఎస్.భారత్ ఆన్‌లైన్ ట్రావెల్స్ టికెట్లు అధినేత ఎస్.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, జామెంటరీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం



పెద్దకాపులేఔట్‌లో జరిగింది. నరసింహారెడ్డి, రవి, శ్రీదేవి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో చైర్‌ఓరేషన్ విజయవంతం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చైర్ ఓరేషన్ కార్యక్రమం విజయవంతమైందని డైరెక్టరు డాక్టరు వెంగమ్మ తెలిపారు. స్థానిక పద్మావతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఇలాంటి వైద్య విద్య కార్యక్రమాలకు హాజరుకావడం ద్వారా వైద్య పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన న్యూరో సర్జరీ విభాగాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురానికి చెందిన శ్రీచిత్ర తిరునాల్ ఇన్సిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డైరెక్టరు డాక్టరు సంజయ్ బిహారీ బయో ఎథిక్స్ ఇన్



మెడిసిన్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు శరణ్ బి సింగ్, డాక్టరు రామ్, డాక్టరు రమేష్ చంద్ర, డాక్టరు శివకువవమార్, అలోక్ సచిన్, కళావత్, డాక్టరు వనజాక్షమ్మ పాల్గొన్నారు.

'ఇంకా కొనసాగుతున్న మహద్ పోరాటం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ఇంకా కొనసాగుతున్న పోరాటం' పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతి ఎంఆర్‌పల్లిలోని ఆర్‌పిఐ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1927లో ముంబాయి నగరంలో మహద్ చెరువునందు దళితులు తాగునీరు తీసుకోకుండా నిషేధించడం జరిగిందని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన చదువు పూర్తి అయిన తరువాత మొట్టమొదటిసారి చేపట్టిన ఉద్యమం మంచినీటి పోరాటమన్నారు. ఈ పోరాటాన్ని పౌరహక్కుల ఉద్యమ నేత బొజ్జాతారకం 2011లో ఆంగ్లంలో రాశారని, తెలుగు ప్రజల కోసం ముఖ్యంగా ఉద్యమ కారుల కోసం ప్రముఖ రచయిత్రి యార్లగడ్డ నిర్మల అనువదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి గొడుగుచింత



గోవిందయ్య, ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య, బిసీ ఉద్యమ నాయకులు సదాశివం, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్నం కాలయ్య, సామాజిక ఉద్యమ నేత సంగీతం విశ్వనాథం, ఆర్‌పిఐ జిల్లా అద్యక్షులు ఎ.సుబ్రమణ్యం, బొజ్జా తారకం కాలనీ అధ్యక్షులు మేకల బాబు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఫార్మసీ పరిశీలన

తిరుపతి సిటి : శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నూతనంగా నిర్మించిన మందుల తయారీ కేంద్రాన్ని టీటీడీ జేఈవో శ్రీమతి సదా భార్గవి గురువారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఎస్వీ గోశాలలో నిర్మించిన పరిమళ భరిత అగర బత్తీల తయారీ రెండో యూనిట్ , నూతనంగా నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ను పరిశీలించారు. శుక్రవారం ఉదయం టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి ఈ మూడు ప్లాంట్లను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను జేఈవో సదా భార్గవి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ రెడ్డి, ఈ ఈ లు మనోహర్, మురళీకష్ణ, డి ఈ సరస్వతి, ఆయుర్వేద ఫార్మసీ సాంకేతిక అధికారి డాక్టర్ నారప రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏకశిలానగరం ముస్తాబు

నేడు ధ్వజారోహణం

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయం వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఆలయానికి పురాతన, చారిత్రక ప్రాశస్త్యం ఉంది. ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తులు ఉండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలానగరం అని అంటారు. మార్చి 31 నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు జరుగనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. కంకణభట్టార్ కెహెచ్.రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శుక్రవారం ధ్వజారోహణం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్లు వెంకటేశయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కోదండ రామాలయం వద్ద నిర్వహించిన పోతన భాగవతం కవి సమ్మేళనం భక్తులను ఆకట్టుకుంది.

నేడు ' సంకెళ్లను తెంచుకుంటూ ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు ఆత్మకథ ' సంకెళ్లను తెంచుకుంటూ ' పుస్తకాన్ని శుక్రవారం శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నామని డాక్టర్ ఎన్ .సిద్దోజి రావు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకి మాధవరావు రాసిన సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకంలో తాను చిన్ననాటి నుంచి ఎదుర్కొన్న పరిస్థితులు చిన్న పాలేరు నుండి చీఫ్ సెక్రటరీగా ఎదిగిన క్రమాన్ని పుస్తకంలో చక్కగా వివరించారన్నారు. ఈ పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనువడు ప్రకాష్ అంబేద్కర్ హాజరవుతారన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకులంలో 2022-23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నుండి 13 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్కులు ఆధారంగానే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షకు నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

నాయుడుపేట సీఐకి తప్పిన పెనుప్రమాదం



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు భారీ ప్రమాదం నుంచి బయటపట్టారు. పండ్లూరు సమీపంలో నాయుడుపేట నుంచి పండ్లూరుకి వెళుతున్న సీఐ వాహనాన్ని వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో కారులోని సీఐతోపాటు డ్రైవర్ భాస్కర్, హోమ్‌గార్డు వెంకటేశులు, కానిస్టేబుల్ చిరంజీవి గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం నాయుడుపేటలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సీఐను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం, పొట్లూరి రాజేష్ ఆయనను పరామర్శించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



ప్రజాశక్తి- నగరి: మున్సిపల్ పరిధి కీళపట్టు హైవే బ్రిడ్జి సమీపం పొదళ్లలో గుర్తు తెలియని ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతిచెందాడు. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళకత్యాలు తీర్చుకోవడానికి ఏటిగట్టున పొద్దళ్ల వద్దకు వెళ్లిన వారు మతదేహం చెట్టుకు వేళాడుతూ ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మతదేహాన్ని పరిశీలించారు. ఆ వ్యక్తి ఎవరని గుర్తించ లేకపోయారు. మృతునికి వయస్సు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుంది. జంద్యం ధరించి ఉన్నాడు. మృతదేహానికి సమీపంగా పురుగుల మందు బాటిల్ కూడా ఉండటంతో ఆత్మహత్య చేసుకోవాలన్న కృతనిశ్చయంతో వచ్చినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చిత్రకళాకారునికి సిపిఐ అభినందనలు



ప్రజాశక్తి - తిరుచానూరు: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ప్రముఖ చిత్రకారుడైన పల్లె చిరంజీవి క్లాత్ పై కాఫీ పొడితో చిత్రీకరిస్తున్న అంబేద్కర్ చిత్రపటాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, జిల్లా నేతలు గురువారం సాయంత్రం ఐదు గంటలకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సందర్శించి, చిత్రకళాకారుని అభినందించారు. ఈ సందర్భంగా కే నారాయణ , పి. హరినాధ రెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయసులో పల్లె చిరంజీవి, ఆయనసతీమణి అశ్వినీల పట్టుదల, వారి సంకల్పం సంపూర్ణంగా నెరవేరాలని ఆకాంక్షించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహా గొప్ప వ్యక్తని, ఆ మహనీయుని చిత్రపటాన్ని భారీ స్థాయిలో ఏర్పాటు చేసి తిరుపతి యూనివర్సిటీ నుండి దేశ రాజధాని ఢిల్లీకి తీసుకెళ్లాలి అన్న చిరంజీవి ఆలోచన మంచి ఉద్దేశంతో కూడుకున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి పి మురళి , నాయకులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, జై విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎస్వీయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి నిధులు



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి రూ.40 లక్షల నిధులను యూజీసీ విడుదల చేయడంపై వీసీ ఆచార్య కె రాజారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిధులు తీసుకురావడంలో నిరంతరం శ్రమించిన డైరెక్టర్ ఆచార్య కోదండరామిరెడ్డిని అభినందించారు. సదరు గ్రాంటు దస్త్రాన్ని డైరెక్టర్ కు అందజేశారు.2021-2022 సంవత్సరానికి రావలసిన నిధులు పూర్తిగా వచ్చాయని, గడచిన రెండు విద్యాసంవత్సరాలలో యుజిసి ద్వారా రావాల్సిన రూ.2.45 కోట్లు ఎస్వీయూకి అందాయని చెప్పారు. ఆచార్య కోదండరామిరెడ్డి డైరెక్టర్ గా ఎస్వీయూ హెచ్‌ఆర్‌డీసీ సమర్ధవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. ఆయనకు మార్చి 31న ఉద్యోగవిరమణ చేస్తున్న సందర్భంగా ఆ కేంద్ర నిర్వహణ బాధ్యతలను ఫిజిక్స్ విభాగ ఆచార్యులైన ఆర్పి. విజయలక్ష్మికి అప్పగించే ఉత్తర్వులను అందజేశారు. ప్రస్తుతం ఫిజిక్స్ విభాగాధిపతిగా వున్న ఆమె రేపు డైరెక్టర్ గా పదవీబాధ్యతలు చేపడుతారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, డా. ప్రయాగ, డా. నాగరాజశ్రీ పాల్గొన్నారు.

శ్రీకోటమ్మ దేవస్థానం భూములు కాపాడాలి

ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం భూములను ఆక్రమించిన వారి నుంచి తక్షణమే కాపాడాలని భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానానికి సంబంధించిన సర్వే నంబర్ 1303లో 1.66 సెంట్లు పట్టా భూమి ఉందన్నారు. ఆ సర్వే నంబర్‌లో పురాతన కాలంలో కోనేరు ఉండేదని.. ఉత్సవాలు జరిగేటప్పుడు ఆ కోనేరులో తెప్పోత్సవం జరగడమే కాకుండా చుట్టుపక్కల ప్రదేశాల నుంచి దాహార్తిని తీర్చుకోవడానికి పశువులకు అనుకూలంగా ఉండేదని గుర్తు చేశారు. అయితే ఆ భూమిని అధికార పార్టీ నాయకులు ఆక్రమించడమే కాకుండా మిగతా పట్టా భూమిని సచివాలయ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. దేవాలయాల భూముల్లో ఎలాంటి ప్రభుత్వ కట్టడాలను నిర్మించకూడదని హైకోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయన్నారు. అయితే హైకోర్టు ఉత్తర్వులు దిక్కరించి ఆయా భూములను ఆక్రమించి ఉండటం దారుణమని తెలిపారు. ఆక్రమించిన భూమిని, అలాగే నిర్మించిన సచివాలయ కార్యాలయాన్ని తొలగించి శ్రీ కోటమ్మ తల్లి దేవస్థాన అభివద్ధికి సహాయపడాలన్నారు. అలాగే వెంకన్నపాలెం సచివాలయ భవనాలను అక్రమంగా శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం పట్టా భూమిలో సచివాలయాన్ని నిర్మించినా స్పందించని అధికారులపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు.